తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉంది

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ మంజుల

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 23 : దేశభాషలందు తెలుగు లెస్స అని ఎందరో కవులు రచయితలు మహానుభావులు తెలుగు భాష యొక్క ప్రాధాన్యతను ప్రపంచ పటంలో నిలిపారని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆవుల మంజుల అన్నారు. ఆదివారం చాదర్ ఘాట్ లోని భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల రీయూనియన్ పేరిట పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె డాక్టర్ పద్మావతి, డాక్టర్ వెంకటరమణ డి.మధుబిందు భాగ్య మెమోరియల్ గర్ల్స్‌హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ శ్రీలత గౌతమ్, ప్రిన్సిపాల్ రత్న మేరీ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు పాశ్చాత్య పోకడలకు పోకుండా తెలుగు భాష ప్రాధాన్యతను గుర్తించి భాషపై పట్టు పెంచు కోవాలన్నా రు. ఈ సందర్భంగా భాగ్య మెమోరియల్ బాలిక ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 2024 వరకు విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులను, నాలుగో తరగతి సిబ్బందిని శాలువా జ్ఞాపకల తో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థినులు పాఠశాలలో తాము చదువుకున్న సమయంలో తరగతి గదులను సందర్శించి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వానం

చీఫ్‌విప్ రామచంద్రనాయక్‌తో మల్లికార్జున్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 23: శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా ఈనెల 27వ తేదీన కురవి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కాసుల మల్లికార్జున్, తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్ రామచంద్రనాయక్‌ను సేవాసమితి ప్రతినిధులు కలిసి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మించు ఆనంద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

గొంతెండుతోంది..

ఆదివారం తాగు నీరు రాకపోవడంతో ఖాళీగా దర్శన మిస్తున్న బిందెలు

చార్మినార్, ఫిబ్రవరి 23 : పాత బస్తీలో నీటి ఎద్దడి అప్పుడే ప్రారంభమైంది. ఎండాకాలం ఆరంభంలోనే ప్రజల గొంతు ఎండుతోంది. ఎండలు ప్రారంభం కాకముందే తాగు నీరు రాని పరిస్థితి ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాటర్ వర్క్స్ అధికారులు ముందస్తు ప్రణాళికలతో నీటి సరఫరాల్లో అవంతరాలను తగ్గిస్తూ ప్రజలకు నీటిని అందించాలి. కానీ అధికారులు ఆ దిశాగా అలోచించడం లేదని తెలిపారు.

మంచినీటి సరఫరా అస్త వ్యస్తం..

పాతనగరం లోని బాలాపూర్, రియాసత్ నగర్, మీరాలం, షంశీర్ గంజ్‌రిజర్వాయర్ పరిధిలోని ఫలక్ నుమా, కందికల్ గేట్, అరుంధతి కాలనీ, ఉప్పుగూడ, ఘాజీమిల్లాట్, శివాజీ నగర్ తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా అస్త వ్యస్తంగా మారింది. నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుందో... ఎప్పుడు కాదో అయోమయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సరఫరా సైతం అరగంట లోపే లో ప్రెషర్‌తో వస్తుందని ఇంటి అవసరాలకు కూడా సరిపోవట్లేదని తెలిపారు. ఇప్పుడే ఇలా ఉంటే ఎండాకాలం ఎట్లా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

మంచినీటి సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిసార్లు పై నుంచి నీటి సరఫరా లేనప్పుడు కొన్ని ప్రాంతాల్లో మంచి నీటి సరఫరా పై ప్రభావం ఉంటుంది. ఎండాకాలంలో మంచినీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– కార్తిక్, వాటర్ వర్క్స్ మేనేజర్

రింగ్‌ఫైట్ తెలంగాణ సంప్రదాయ క్రీడ

ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులను అందజేసిన డాక్టర్ రామ్‌రెడ్డి, తాడెం రవికుమారు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 23: బాక్సింగ్‌తరహాలో ఉండే రింగ్ ఫైట్ తెలంగాణ సాంప్రదాయానికి చెందిన క్రీడ అని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమాన్ టేకిడిలోని బీసీ సాధికారత భవన్‌లో రింగ్ ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తాడెం రవికుమార్ ఆధ్వర్యంలో తొమ్మిదవ జాతీయస్థాయి రింగ్స్ ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికుమార్, ప్రధాన కార్యదర్శి మచ్చ ప్రభాకర్, నాయకులు షేక్ అబ్దుల్లా, చంద్రశేఖర్, ఓం ప్రకాశ్ కటారియా తో కలిసి రింగ్ ఫైట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి న క్రీడాకారులకు మోమెంటో తో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయంతో పుట్టిన రింగ్ ఫైట్ క్రీడ ప్రపంచ స్థాయికి తీసుకుపోవడం దేశానికే గర్వకారణం అన్నారు. ఫైట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తాడేం రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి ఈ ఏడాది మే నెలలో 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రింగ్ ఫైట్ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ పోటీలను నగరంలోని దోమలు కూడా ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పోటీలకు సుమారు 8 దేశాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న అన్ని రాష్ట్రాల కోచ్‌లను, మెమెంటోలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పూర్ణచందర్ మహంతి, ప్రేమ్ కుమార్, బసవరాజు, జస్వీందర్ సింగ్, పెరుమల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన ద్వారానే మెరుగైన సమాజం

శంకరమఠంలో శివభక్తి సుధ కార్యక్రమంలో ఓలేటి పార్వతీశం తదితరులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 23 : సాహితి జిగీష సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శివ భక్తి సుధ శీర్షికన నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసంగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓలేటి పార్వతీశం విచ్చేసి ప్రసంగించారు. ఆధ్యాత్మిక చింతన ద్వారానే మరుగైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. సభాధ్యక్షులుగా ఆచార్య టి. గౌరీశంకర్ సభను నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఆచార్య ఫణీంద్ర, ఎం. దత్తాత్రేయ శర్మ విచ్చేశారు. సభకు ముందు శివతత్వ విశేష పై వక్తలు ప్రసంగించారు. డాక్టర్ మహంతయ్య, పాల్కూరికి సోమనాథుడు, ఆచార్య సాగి కమలాకర శర్మ, శ్రీనాథుడు, డాక్టర్ పి. లలితవాణి, దూర్జటి రచించిన శివతత్వాలపై ప్రసంగించారు. కార్యక్రమ వ్యా ఖ్యతగా ఉమాశశి వ్యవహరించగా, వందన సమర్పణ రఘు గావించారు. బండారుపల్లి రామ చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను నృత్యకళలో ప్రోత్సహించాలి

విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం జాతీయ స్థాయి క్లాసికల్ డ్యాన్స్, మ్యూజిక్ కార్యక్రమం జరిగింది. నృత్య ప్రదర్శనలతో అలరించిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించిన నటిమణులు రాగిణి, జ్యోతి రెడ్డి, హెల్త్ ఫిట్‌నెస్ మోటివేటర్ అనుప్రసాద్, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవి తదితరులు. – తెలుగు యూనివర్సిటీ

చురుకైన కార్యకర్తను పార్టీ కోల్పోయింది

శ్యామ్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 23 : నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.శ్యామ్(గోల్నాక శ్యామ్)(59) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని తల్లి, సోదరుడు యాదగిరి తదితరులు కుంభమేళాకు వెళ్లడంతో శనివారం జరగాల్సిన అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. చాలా మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మంచి చురుకైన కార్యకర్తను పార్టీ కోల్పోయిందని ఎమ్మెల్యే అన్నారు. కాచిగూడలోని హర్రాస్ పెంట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

శాకాహార ర్యాలీ

శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

మైహిదీపట్నం, ఫిబ్రవరి 23: పిరామిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో మైహిదీపట్నం, గుడిమల్కాపూర్, కార్వాన్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 150 మందితో కలిసి ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. మనిషికి శాకాహారమే సరైన ఆహారమని, మానసిక సమతుల్యతకు బుద్ధి వికాసానికి తోడ్పడుతుందనీ తెలిపారు. శాకా హారం తీసుకుంటే సకల జంతువులపై కరుణ, దయ ప్రేమ చూపడమే అవుతుందని, అందరూ శాకాహారులుగా ఉండడమే సకల ప్రాణుల పట్ల పరమ ధర్మంతో వ్యవహరించటం తెలుస్తుందని తెలిపారు. అలాగే శ్వాసపై ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని, ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్ప శక్తి, ఆత్మవిశ్వాసం లభిస్తాయిని తెలిపారు.

యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించే దిశగా కృషి

జాబ్ మేళాను ప్రారంభిస్తున్న అతిథులు

జియాగూడ, ఫిబ్రవరి 23 : నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామని ఇమాంపురా నవ భరత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో నవభారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ అధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని మధిర సత్యనారాయణ జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై పేర్లను నమోదు చేసుకొని, ప్లేస్‌మెంట్ అపోర్చునిటీని పొందారు. ఈ సందర్భంగా మధిర సత్యనారాయణ మాట్లాడుతూ.. జియాగూడలో ఎందరో నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారని వారు ఉద్యోగాల్లో స్థిర పడితే ప్రయోజనం ఉటుందని అన్నారు. మేజిక్ బస్ ఇండియా లివలీహుడ్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీ త్రినాథ్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మెళాలో లైఫ్ స్కిల్స్ బేస్డ్ ఎంప్లాయిమెంట్ లింక్‌డ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని అన్నా రు. ఇందులో 8 వారాలు కోర్స్ ఉంటుందని, ఇందులో ఆఫ్ లైన్, మరియు ఆన్‌లైన్ కోర్సులు ఉంటాయని అన్నారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లెమ్ సాల్వింగ్, టీమ్‌వర్క్, మేనేజింగ్ హెల్ప్ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జి. వినయ్ కుమార్, జి. మహేందర్, వై. జస్వంత్ కుమార్, ఎం. మహేశ్ బాబు, ఎస్. శ్రవాణ్, ఏ గౌతమ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రకాంత్, ఇంతియాజ్, శానవాజ్, సంజన నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జియాగూడలో వైజ్ఞానిక ప్రదర్శన

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, కరస్పాండెంట్ ప్రణీత

జియాగూడ, ఫిబ్రవరి 23 : విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహద పడతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం సబ్జిమండి శ్రీ సాయి హై స్కూల్ లో సైన్స్ ఎక్సపో ప్రదర్శన స్కూల్ కరెస్పాండంట్ ప్రణీత ఆధ్వర్యంలో ఏర్పాటు కాగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎక్సపోను ప్రారంభించారు. అనంతరం అయన ప్రదర్శన ను తిలకించి మాట్లాడుతూ.. శ్రీ సాయి హైస్కూల్ ప్రతి యేటా విద్యార్థుల సైన్స్ ప్రదర్శన, గేమ్స్ నిర్వహించడం హర్షణీయమన్నారు. కరస్పాండెంట్ ప్రణీత మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొనగా ఉత్తమ విద్యార్థులకు ప్రొచ్చాహక బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్, గంగ పుత్ర సంఘంము అధ్యక్షుడు డి. శ్రీనివాస్, నాయకుడు ముత్యాల భాస్కర్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వక్తలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో విద్య వ్యవస్థలు ప్రైవేటు యాజమాన్యం ఆధీనంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వ ఆధీనంలో 50 శాతంగా ఉన్న ప్రాథమిక, మాధ్యమిక విద్యలో మౌలిక వసతులు, విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ప్రైవేట్ బాటపడుతున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందని డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోషియేషన్ విమర్శించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమాన విద్యా అవకాశాలు, నాణ్యమైన విద్యకోసం డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఆటీఏ) ఆవిర్భావం సందర్భంగా పలువురు వక్తలు విచ్చేసి ప్రసంగించారు. వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాసు మారేడు, ప్రొఫెసర్ మొహినోద్దీన్, ఉపేందర్, డా.రజిత, మల్లేశ్, నరేందర్, ప్రొఫెసర్ శోభ, గణేశ్ విచ్చేసి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఇంజినీరింగ్ విద్య మొత్తానికి ప్రైవేట్ యాజమాన్యంలోనే కొనసాగుతుందన్నారు. ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. యుజీసీ, ఏఐసీటీఈ,ఎస్‌సీఆర్‌సీ లాంటి సంస్థలు విధించిన నియమ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడలేదని విమర్శించారు. అన్ని అర్హతలు ఉన్న బోధన సిబ్బందిని ఇంజినీరింగ్ కళాశాలలు నియమించుకోకపోవడంలేదని, సిబ్బందికి సరైన జీతాలు కూడా చెల్లించడంలేదన్నారు. విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తూ కేవలం లాభార్జనే ధ్యేయంగా నడుపిస్తున్నారని విమర్శించారు. నాణ్యమైన విద్యసాధించడం కోసం డిమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, ప్రైమరీ టీచర్స్ నుంచి యూనివర్సిటీ టీచర్స్ వరకు అంద రూ ఈ సంస్థలో సభ్యులుగా చేరి విద్యారంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొంటూ నాణ్యమైన విద్య కోసం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహ్మద్ మొహినుద్దీన్, డా.సీతారాములు, ఎం.ఎన్. నర్సయ్య, డా.ఉపేందర్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మీరాజ్ తెలిపారు. ఆదివారం అయన రెయిన్ బజార్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జ్యూజిస్తూ ఛాంపియన్ షిప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో శరీరక ఎదుగుదలతో పాటు తోటి సభ్యులతో కలిసి ఆటలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత ఇతరులకు అదర్శనంగా నిలవాలన్నారు. జ్యూజిస్తూ క్రీడలు మరింత ప్రాచుర్యం పొందాలని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం లో రెయిన్ బజార్ కార్పొరేటర్ వాషాయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

– చార్మినార్, ఫిబ్రవరి 23

యువతి అదృశ్యం

భాను శ్రీ

కాచిగూడ, ఫిబ్రవరి 23 : మెడికల్ షాప్ కు వెళ్లిన యు వతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ వీరన్న గుట్ట ప్రాంతానికి చెందిన భాను శ్రీ (23) శనివారం ఉదయం మెడికల్ షాపుకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కలత చెందిన కుటుంబ సభ్యులు, మేనమామ శివరాజ్ కాచిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి23 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను జాతీయ ఎస్సీ కమిషన్ తక్షణమే అడ్డుకోవాలని, వర్గీకరణతో నేతకాని, మహర్ కులాలకు తవ్ర నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర నేతకాని, మహర్ కుల సంఘం అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ (నూఢిల్లీ)కి వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంకాపి జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ డైరెక్టర్ (హైదరాబాద్)కు అందజేశారు. కార్యక్రమంలో జేఎస్‌రావు, మద్దెల ప్రవీణ్‌కుఆర్,చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంబంధం లేని వ్యక్తులు దాడి చేస్తున్నారని ఫిర్యాదు

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 23: మసీదు, అఫ్జల్ గంజ్ మార్కెట్ కు సంబంధం లేని వ్యక్తులు తమపై దాడి చేసేందుకు ప్రయత్నించారని వారిపై చర్యలు తీసుకోవాలని మసీద్ ఏ చమన్ కమిటీ సభ్యులు అఫ్జల్ గంజ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్ లో మసీద్ ఏ చమన్ కమిటీ అధ్యక్షుడు యునెస్ అహ్మద్ ఫిర్యాదు పత్రాన్ని అందజేసి తమపై దాడికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ మసీద్ తో ఎలాంటి సంబంధం లేని వారు ఈ మసీద్‌కు తామే కమిటీ ప్రతినిధులమని తమతో గొడవకు దిగి , దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. త్వరలో జరగబోయే రంజాన్ సందర్భంగా మసీద్ వద్ద పండుగ బ్యానర్ లు కట్టడంతో పాటు శుభ్రం చేస్తుండగా , ఎం.ఏ. మన్నన్ , ఎమ్.కె. నయిముద్దీన్ కొంతమంది గుండాలను తీసుకొని వచ్చి , బ్యానర్ లను చించివేయడంతో పాటు తమపై దాడి చేశారని ఆరోపించారు. 2023 లో మసీద్ ఏ చమన్‌కు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎంఏ హకీమ్ 11 మంది కమిటీ సభ్యులను నియమించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అట్టహాసంగా కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శనలో కళాకారిణులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 23: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భం భం భోలే సాంస్కృతిక కూచిపూడి నృత్యరూపకం అంగరంగ వైభవంగా నిర్వహించారు.భారత్ ఆర్ట్స్ అకాడమీ,ఏబీసీ ఫౌండేషన్ చైర్మన్ లయన్ కె.వి.రమణారావు సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వక్తలుగా సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, టీవీ ఆర్టిస్ట్ శ్రీవాణి, విక్రమ్, చకిలం స్వప్న శ్రీనివాస్, మ్యూజిక్ టీచర్ స్వాతి, మాధవి, దైవజ్ఞశర్మ తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం కూచిపూడి నృత్యప్రదర్శను ప్రారంభించి, కళాకారులకు , నృత్యగురువులకు మెమెంటోలు బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ.. భారత్ ఆర్ట్స్ అకాడమీ లయన్ రమణారావు, లలితారావులు ఎంతో మందని కళాకారులుగా తయారు చేసి రవీంద్రభారతి వేదికపై నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సభకు ముందు కూచిపూడి నృత్యకారిణులు ప్రదర్శించిన భం భం భోలే శివనృత్యం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో సంగీత ఉపాధ్యయుడు విజయ్, చంద్రశేఖర్, కొండపల్లి నవ్య, సరస్వతి, నిర్వాహకురాలు లలితారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.8 లక్షల కోట్ల ఆస్తులకు రక్షణగా వక్ఫ్

అభివాదం చేస్తున్న ముస్లిం నేతలు

మెహదీపట్నం, ఫిబ్రవరి 23 : మెహిదీపట్నం లోని రూప్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ, మలక్‌పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ, మలక్‌పేట్ నియోజకవర్గం షేక్ అక్బర్ అధ్వర్యంలో 'తెలంగాణ మైనార్టీ రైట్స్ సేవ్ వక్ఫ్' సదస్సును నిర్వహించారు. దీనికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్‌పాషా, మైనారిటీ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. దేశంలో కుల, మతంతో సంబంధం లేకుండా అందరూ సమానమని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అదే చెపుతుందన్నారు. ఈ దేశం అందరిదని, అందరికీ హక్కులు ఉన్నట్లే మైనారిటీలకు కూడా ఈ దేశంలో హక్కులు ఉన్నాయన్నారు.

రూ.8 లక్షల కోట్ల ఆస్తులకు వక్ఫ్ బోర్డు రక్షణగా నిలిచిందనీ, మోదీ ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త వక్ఫ్ చట్టం ఆమోదయోగ్యంగా లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మైనార్టీలకు అండగా ఉంటదని ఈ సందర్భంగా అన్నారు.

బద్దం బాల్‌రెడ్డికి నివాళి

కార్వాన్ మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి 6వ వర్ధంతిని గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన బీజేపీ నాయకులు రాధాక్రిష్ణ యాదవ్, సందేష్ యాదవ్, బండారి శ్రీధర్, శ్రీకాంత్ సాగర్, బుచ్చి యాదవ్, వినోద్ యాదవ్, శ్రీకాంత్ సాగర్ తదితరులు. – కార్వాన్

ఆర్థిక సాయం

తోటి ఉద్యోగి సతీమణి మృతి చెందడంతో ఆర్థిక సాయాన్ని అందించి ఉద్యోగులు మానవతాన్ని చాటుకున్నారు. సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూ తి దవఖానలో సానిటేషన్ వర్కర్ గా పని చేస్తున్న దశరథ్ సతీమణి పది సంవత్సరాలుగా పక్షవాతం తో బాధపడుతూ మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనూరాధ, తోటి ఉద్యోగులతో పాటు స్కాట్లాండ్ సంస్థ శానిటేషన్, సెక్యూరిటీ ఉద్యోగులు తమ వంతు ఆర్థిక సహాయాన్ని ఆదివారం దశరథ్‌ను ఆయన నివాసంలో అందజేశారు. – సుల్తాన్‌బజార్

ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కాచిగూడ, ఫిబ్రవరి 23: తెలంగాణలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫల మయ్యాడని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలి అడ్డలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16 లక్షల పైగా పట్టబద్రులు ఉన్నా, వారందరూ ఉద్యోగాలు రాక నిరాశ చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులకు నెలకు రూ. 3,000 చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళకు కుట్టు మిషీన్ అందిస్తున్న ఎంపీ ఒవైసీ

చార్మినార్, ఫిబ్రవరి 23: మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి భరోసా కల్పించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఆదివారం యాకుత్‌పుర నియోజకవర్గం రెయిన్ బజార్ డివిజన్ లోని ఇమిలీబన్ ప్రాంతంలో స్థానిక మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓవైసీ మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక సమస్యలు లేకుండా వారి ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కుట్టు మిషన్‌లను అందిస్తూ, ఇంటివద్దనే మహిళలు ఉపాధి పొందే విధంగా సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఇమిలీ బన్ లో నిర్వహించిన ఈ పోగ్రాం లో 25మంది మహిళలకు కుట్టు మిషన్‌లు అందించారు. ఈ కార్యక్రమం లో యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గన్‌పార్క్‌లో లక్ష్మీనారాయణ విగ్రహం పెట్టాలి

రవీంద్రభారతి,ఫిబ్రవరి 23 : అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక స్థూపం నిర్మించిన స్మారక దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ముదిరాజ్ సంక్షేమ సమితి కన్వీనర్ బానిస నారాయణముదిరాజ్, అధ్యక్షుడు అల్లాదుర్గం సురేశ్‌ముదిరాజ్, బాలుగారి నర్సింలు, కటికల శ్రీహరి తదితరులు పాల్గొని 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన విద్యార్థులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరుల స్మారక స్థూపాన్ని చెక్కిన ఎక్కా యాదగిరికి పద్మశ్రీ అవార్డుతో పాటు కోటి రూపాయల నజరానాను, 300 గజాల స్థలాన్ని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాటి అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆనాటి హైదరాబాద్ మేయర్ ముదిరాజ్ బిడ్డ నెల్లి లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారని,అలాంటి ముదిరాజ్ బిడ్డ నెల్లి లక్ష్మీనారాయణకు ప్రస్తుత గన్‌పార్కను నెల్లి లక్ష్మీనారాయణ గన్‌పార్క్‌గా చేసి, ఆయన విగ్రహాన్ని పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

రంజాన్ కు ఏర్పాట్లు చేపట్టండి

రంజాన్ మాసంలో ప్రార్థన కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా మసీదులలో ఏర్పాట్లు చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన మసీదులను పురావస్తు శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల వద్ద రంజాన్ మాసంలో ప్రార్థన కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. – మెహిదీపట్నం, ఫిబ్రవరి 23